ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 30 | జూన్ | 2024
పేజీలు 6

## చట్టాల పట్ల అవగాహన అవసరం

సీనియర్ న్యాయవాది గంటా విద్యాసాగర్ రెడ్డి



3 లో

# గోబెల్స్‌ను మించిన మోడీ



**-రాజకీయ తటస్థత మోసానికి నాంది**
**-ప్రజలు ప్రతిపక్షం కాకుండా పాలన**
**-మీడియా సమావేశంలో**
**సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మోడీ అబద్దాలు చెప్పడంలో గోబెల్స్‌ను మించిపోయాడని భారతదేశ చరిత్రలో ఏ ప్రధాని చెప్పనన్ని అబద్దాలు చెప్పి ఆయన రికార్డును సొంతం చేసుకున్నారని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ తెలిపారు. అతి తక్కువ మెజార్టీతో గెలిచిన ప్రధాన మంత్రిగా కూడా ఆయన అపకీర్తిని మూటకట్టుకున్నారన్నారు. సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో భాగంగా శనివారం జరిగిన మీడియా సమావేశంలో నారాయణ మాట్లాడుతూ మోడీ గ్యారెంటీ కాదని ఆయన మాటల్లో వాస్తవికత లేకపోవడం వల్లే బిజెపి 305 స్థానాల నుండి 240 స్థానాలకు పడిపోయి చావుతప్పి కన్నులొట్టబోయిన చందంగా అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పుడు బీహార్

మిగతా 2లో..

## సమస్యల పరిష్కారానికి
# సమరశీల పోరాటాలు



2 లో

## జాతీయ రహదారుల అభివృద్ధికి
# రూ. 655 కోట్లు మంజూరు



**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉమ్మడి ఖమ్మంజిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధికి రూ. 655 కోట్లు నిధులు మంజూరైనట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం వీడియోస్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఉన్న జాతీయ రహదారులకు ఇప్పుడు ఉన్న జాతీయ రహదారులకు ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లినప్పుడల్లా కేంద్ర మంత్రులను కలిసి నిధులు మంజూరు చేయాలని కోరిన నేపథ్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆరు రోడ్లకు రూ.655 కోట్లు నిధులు మంజూరైనట్లు మంత్రి తెలిపారు. గతంలో తాను ఆర్అండ్‌బి మంత్రిగా ఉన్నప్పుడు ఈ రహదారుల గురించి ప్రతిపాదన చేసినట్లు తెలిపారు. కొత్తగూడెం, పాల్వంచ బైపాస్ రోడ్డు

మిగతా 2లో..



# గోబెల్స్‌ను మించిన మోడీ

(మొదటిపేజీ తరువాయి)

నితీష్‌కుమార్ ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు పై ఆధారపడి పాలన సాగించాల్సి వచ్చిందన్నారు. రూ. 16 లక్షల కోట్లు ఎగవేతకు మోడీ విధానాలే కారణమని ఎగవేత దారుల్లో ఒక్కరు మినహా మిగిలిన వారంతా గుజరాతీయులేనని గతంలో రూ. 2.50 లక్షల కోట్లు ఎగవేతకు గుర్తైతే మోడీ పదేళ్ల కాలంలో రూ.16 లక్షల కోట్లకు ఎగవేత సొమ్ము చేరిందని నారాయణ తెలిపారు. సెక్యూలరిజాన్ని, మతాన్ని వదలకుండా విమర్శించిన మోడీకి ఆశించిన ఫలితం దక్కలేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఒక బలమైన ప్రతిపక్షం కలిగిన ప్రభుత్వం ఏర్పడిందని ఆయన తెలిపారు. కార్మిక చట్టాలను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మార్చారని ఇప్పుడు దానిని సవరించాల్సిన అవసరం ఉందని ఆయన కోరారు. బిజెపి సవరించిన కార్మిక చట్టాలను అమలు చేయాలని చూస్తే ప్రతిఘటన తప్పదని నారాయణ హెచ్చరించారు. రాజకీయ పార్టీలు తటస్థ వైఖరిని అవలంభిస్తున్నాయని ఇది సరైంది కాదని తటస్థ వైఖరి ఎవరినో ఒకరిని మోసం చేయడానికేనని నారాయణ తెలిపారు. స్పష్టమైన వైఖరిని అవలంభించిన రాజకీయ పార్టీలకు ప్రజలు పట్టం కట్టారని దోబుచులాడిన వారిని ఓడించారన్నారు. బిజెపికి మద్దతు అంటూనే స్వతంత్రతను ప్రకటించిన వైసిపిని ఓడించారని గెలిచిన చంద్రబాబుది బిజెపి విషయంలో సరైన వైఖరి కాదన్నారు. కేరళలో కాంగ్రెస్, లెఫ్ట్ మధ్యనే ప్రధాన పోటీ నెలకొందని బిజెపికి వ్యతిరేకంగా నిలబడే కమ్యూనిస్టులను ఓడించాలని కాంగ్రెస్ చూడటం సరైంది కాదన్నారు. తెలంగాణలో బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం పై నారాయణ స్పందిస్తూ ప్రజాప్రతినిధులను చేర్చుకున్నంత మాత్రాన విపక్షం లేకుండాపోదని ప్రజలే విపక్షమవుతారన్న వాస్తవాన్ని చరిత్ర చెబుతుందన్నారు. కేసిఆర్, చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి లాంటి వారు విపక్ష సభ్యులను చేర్చుకుంటే ప్రతిపక్షం ఉండదని భావించారని కాని ప్రజలే విపక్షమై పనిచేసి విపక్షాలను గెలిపించారని ఆయన తెలిపారు. కేసిఆర్ పాలనలో ప్రతిపక్ష సభ్యులే లేకపోయినా ప్రజలు గెలిపించలేదా అని నారాయణ ప్రశ్నించారు. ఏ పార్టీ నుంచి గెలిచారో వారు పార్టీ మారే ముందు పదవికి రాజీనామా చేయాలని చేసిన తర్వాతే రాజకీయ మార్పు జరగాలని నారాయణ డిమాండ్ చేశారు. బిఆర్‌ఎస్ పనులే కాంగ్రెస్ చేస్తుందని ఇది బిజెపికి పరోక్షంగా ఊతమిచ్చినట్లేనని నారాయణ తెలిపారు. బిజెపి నాలుగు నుంచి ఎనిమిది సీట్లు గెలవడం పై కాంగ్రెస్ ఆలోచన చేయాలని బిజెపి బలపడడానికి ఎట్టి పరిస్థితుల్లో అవకాశం ఇవ్వరాదని నారాయణ తెలిపారు. రాష్ట్ర సమితి సమావేశాల్లో పార్టీ కార్యక్రమాలను చర్చించుకుని భవిష్యత్ కార్యాచరణ ను రూపొందించుకుంటామన్నారు. మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్‌కె సాబీర్‌పాషా, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్‌కె జానిమియా పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు



**సభ్యులకు నిరంతర రాజకీయ శిక్షణ**
**విస్తృతికి ఉద్యమ కార్యాచరణ**
**సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో కూనంనేని**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రజా సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలను నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు పిలుపు నిచ్చారు. సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పోరాట ఎజెండా రూపొందించుకోవాలని ఆయన తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సమితి సమావేశం శనివారం సిపిఐ ఖమ్మంజిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగాయి. సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ పాలక వర్గాలు ప్రజలను విస్మరించి పాలన సాగిస్తుంటే ప్రజల పక్షాన కమ్యూనిస్టులుగా నిలవాలని ఆయన సూచించారు. భారతదేశ ప్రజలు గత ఎన్నికల్లో మతోన్మాదానికి వ్యతిరేకంగా తీర్పునిచ్చారని ఇప్పటికైనా మతోన్మాద శక్తులు దీనిని గమనించి విద్వేషాలకు తిలోదకాలు ఇవ్వాలని ఆయన కోరారు. మోడీ ప్రభుత్వం పేదల పట్ల కక్ష సాధింపు ధోరణిని అవలంభిస్తుందని కార్మికుల విషయంలోను బిజెపి వైఖరిలో మార్పు రాలేదన్నారు. ప్రధానమైన వ్యవసాయ రంగాన్ని, పారిశ్రామిక రంగాన్ని మోడీ ప్రభుత్వం విస్మరించడంతో పాటు కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టాలని చూస్తుందని ఆరోపించారు. మోడీ చెబుతున్నట్లు దేశంలో పరిస్థితి లేదని పెరిగిన నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, కొరవడిన ఉపాధి కల్పన భవిష్యత్తులో అశాంతికి దారి తీసే అవకాశం ఉందని కూనంనేని తెలిపారు. ఇక రాష్ట్రంలో బిజెపి పార్లమెంటు ఎన్నికల తర్వాత ఒక ప్రమాదకర శక్తిగా మారుతుందన్నారు. కాంగ్రెస్ బిఆర్‌ఎస్‌ను చంపే ప్రయత్నంలో ఉంటే బిజెపి బలపడే అవకాశం ఉందన్నారు. దీని పట్ల కాంగ్రెస్ బిజెపియేతర పక్షాలు అప్రమత్తంగా ఉండాలని కూనంనేని సూచించారు. సంక్షేమ కార్యక్రమాల అమలు తమ బాధ్యతగా కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు స్వీకరించాలని కూనంనేని కోరారు. జనాభాలో సగ భాగం ఉన్న యువతను కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించలేని పాలకులు, పెరిగిన అవినీతి, కొనసాగుతున్న ప్రైవేటు దందాలు వీటన్నింటికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేయాలన్నారు. పార్టీ లేని గ్రామాల్లో సైతం పార్టీ నిర్మాణం లక్ష్యంగా మండల, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. పార్టీ సభ్యులకు ఇక నుంచి నిరంతర రాజకీయ సైద్ధాంతిక శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. మండలం, జిల్లా, రాష్ట్రం యూనిట్‌గా ఈ శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. ఈ ఏడాది డిసెంబరు 26 నాటికి 99 ఏళ్లు పూర్తి చేసుకుని కమ్యూనిస్టు పార్టీ 100వ సంవత్సరంలోకి అడుగిడుతుందని ఈ సందర్భంగా పార్టీ సభ్యులు ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించుకుని శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా చూడాలన్నారు. కౌన్సిల్ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శులు కె. నారాయణ, అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారుల అభివృద్ధికి
# రూ. 655 కోట్లు మంజూరు

(మొదటిపేజీ తరువాయి)

25 కిలో మీటర్ల మేర రూ. 450 కోట్లు, ఎన్‌హెచ్ 365 ఎ, ఎన్‌హెచ్ 163 జి, మిస్సింగ్ లింక్ కలపడానికి ఆరు కిలో మీటర్ల మేర రూ. 125 కోట్లు, భద్రాచలం పట్టణంలో ఎన్‌హెచ్ 30 అభివృద్ధి కోసం ఏడు కిలో మీటర్ల మేర రూ. 50 కోట్లు, కొత్తగూడెం కలెక్టరేట్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి రూ. 2.64 కోట్లు, కిన్నెరసాని పాత బ్రిడ్జి పక్కన నూతన బ్రిడ్జి కోసం రూ.20.22 కోట్లు, కోదాడ జంక్షన్ నుంచి వరంగల్ క్రాస్ రోడ్డుకు రూ. 7 కోట్లు మొత్తం ఉమ్మడి ఖమ్మంజిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి కోసం రూ. 654.86 కోట్ల పనుల కోసం ఆమోద ముద్ర పడిందన్నారు. రానున్న మూడునెలల్లో డిపిఆర్ తయారు చేసి పనులు ప్రారంభించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. రెండవ జాతీయ రహదారికి శాంక్షన్ వచ్చిందని రూ. 125 కోట్లతో ఏడుకిలో మీటర్లతో ఖమ్మం చుట్టూ రింగ్ రోడ్డు మాదిరిగా ఏర్పడుతుందన్నారు. ఖమ్మంచుట్టూ వచ్చే రింగు రోడ్డు నేషనల్ హైవే అథారిటి కాబట్టి ఎక్కడ పడితే అక్కడ రోడ్లు ఎక్కడానికి ఉండదన్నారు. నేషనల్ హైవే ఎగ్జిట్ ఇచ్చిన వాటి దగ్గరే రోడ్డు ఎక్కాలన్నారు. ఖమ్మం నగరం చుట్టూ ఉన్న రహదారికి సర్వీస్ రోడ్డు కావాలని కేంద్రాన్ని కోరడం జరిగిందన్నారు. కొత్తగా ఖమ్మం నగర సమీపంలోని నాయుడుపేట నుంచి రాపర్తి నగర్ వరకు రెండు బ్రిడ్జిలు, శ్రీశ్రీ విగ్రహం దగ్గర ఓ ఫ్లైఓవర్ బ్రిడ్జి, ఎన్‌టిఆర్ సర్కిల్ దగ్గర ఒక బ్రిడ్జి నిర్మాణం జరిగితే సిగ్నల్ ఫ్రీ ఉంటుందని ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవని దీని కోసం రూ. 80 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేయడం జరిగిందన్నారు. జాతీయ రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి మంత్రి తుమ్మలనాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పి. దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

# నేడు జిల్లాలో ఉప ముఖ్యమంత్రి భట్టి పర్యటన



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మంజిల్లాలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదివారం పర్యటించనున్నారు. హైదరాబాద్‌లోని ప్రజా భవన్ నుంచి ఉదయం ఏడు గంటలకు రోడ్డు మార్గాన ఖమ్మంకు బయలుదేరుతారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కకు జిల్లా అధికార యంత్రాంగం, పార్టీ జిల్లా నాయకులు, శ్రేణులు స్వాగతం పలుకుతారు. ఉదయం 11 గంటలకు ఆర్‌సిఎం చర్చ్ ఎదురుగా స్థంభాద్రి హాస్పిటల్ ను ప్రారంభిస్తారు. అక్కడి నుంచి చింతకాని మండలం గాంధీనగర్‌కు చేరుకుని రూ. 175 లక్షలతో గాంధీనగర్ నుంచి బొప్పారం వరకు రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం మధిర మండలం వంగవీడు గ్రామానికి మధ్యాహ్నం 1.15 గంటలకు చేరుకుంటారు. రూ. 30 కోట్లతో బోనకల్, అళ్లపాడు, వంగవీడు బిటి రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. మధిర క్యాంపు కార్యాలయానికి మధ్యాహ్నం రెండు గంటలకు చేరుకుంటారు. భోజన విరామ అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు మధిర మండలం చిలుకూరు గ్రామంలోని శివాలయం వద్ద రూ. 70 లక్షలతో బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. రూ. 285 లక్షలతో చిలుకూరు నుంచి దొడ్డ దేవరపాడు బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. మధిర మండలం మర్లపాడు గ్రామానికి చేరుకుంటారు. రూ. 275 లక్షలతో మర్లపాడు నుంచి పెనుగోలు, సిద్దినేని గూడెం వరకు బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. ఆ తర్వాత మాటూరు గ్రామానికి చేరుకుని రూ. 500 లక్షలతో మాటూరు నుంచి ముస్లిం కాలనీ బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. రాత్రికి మధిర క్యాంపు కార్యాలయానికి చేరుకుని అక్కడ బస చేస్తారు. సోమవారం ఉదయం ఏడు గంటలకు మధిర క్యాంపు కార్యాలయం నుంచి తిరిగి హైదరాబాద్‌కు వెళ్తారు.

# రైతు బంధు పథకంపై అభిప్రాయాల సేకరణ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రైతు బంధు పథకం అమలుకు సంబంధించి రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించినట్లు వి. వెంకటాయపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్ రావూరి సైదబాబు తెలిపారు. శనివారం పిఏసిఎస్ వివిపాలెం సంఘం ప్రత్యేక మహాజన సభ సొసైటీ ఛైర్మన్ రావూరి సైదబాబు అధ్యక్షతన జరిగింది. ఈ మహాజన సభకు డిప్యూటి రిజిస్ట్రార్ హన్మకొండ ఎం. నీరజ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఖమ్మం పి. శ్రీదేవి, ఆడిటర్లు కళ్యాణి, శంకర్ లు పాల్గొని రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈసమావేశంలో రైతు భరోసా అమలుపై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. పలువురు రైతులు ఐదు ఎకరాల లోపు రైతులకు రైతుబంధు పథకం వర్తింపజేయాలని తెలిపారు. మరి కొంత మంది రైతులు 10 ఎకరాల లోపు ఉన్న వారికి రైతు భరోసా పథకం అమలు చేయాలని కోరారు. సాగు చేస్తున్న రైతులకు మాత్రమే రైతు బంధు అమలు చేయాలని కొంత మంది రైతులు తమ అభిప్రాయాలు తెలిపారు. కౌలు రైతులకు కూడా రైతు బంధు అమలు చేయాలని రైతులు కోరారు.ఈ సందర్బంగా ఛైర్మన్ రావూరి సైదబాబు మాట్లాడుతూ రైతు బంధు పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అందులో భాగంగా రైతుల నుంచి అభిప్రాయలను సేకరిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ ఛైర్మన్ రావెళ్ల శ్రీనివాస్, ఎంపిటిసి యరగర్ల హన్మంతరావు, ఏవో కిషోర్, ఏఈవో త్రివేణి, సంఘం డైరెక్టర్లు చంద్ర మురళి కృష్ణ, అనిత, సొసైటీ సిఈవో అయితగాని తిరుపతి రావు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారులకు నష్టపరిహారం అందించాలని మంత్రి తుమ్మలకు వినతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కలుషిత నీటి కారణంగా మృతి చెందిన చేపలకు నష్ట పరిహారాన్ని మత్స్యకారులకు అందించాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతి పత్రం సమర్పించారు. శనివారం వీడియోస్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, కాంగ్రెస్ నాయకులు రావూరి సైదబాబు, పలువురు మత్స్యకారులు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖమ్మం నగరంలోని కొత్తగూడెం ధంసలాపురం పెద్ద చెరువులో మత్స్య సొసైటీ ఆధ్వర్యంలో మత్స్యకారులు చేపల పెంపకం చేపట్టారన్నారు. ఇటీవల ఖమ్మం నగరంలో పలు ప్రాంతాల్లో డ్రైనేజీలను శుభ్రం చేసే నేపథ్యంలో ఆ నీటినంతా పెద్ద చెరువులోకి వదిలారని దీంతో నీరు కలుషితమై టన్నుల కొద్ది చేపలు మృతి చెందాయన్నారు. మత్స్యకారులకు సుమారు రూ. 80 వేల నష్టం వాటిల్లిందని మంత్రికి వివరించారు. చేపల పెంపకంతో జీవనం సాగిస్తున్న మత్స్యకారులకు ప్రభుత్వం తరుపున నష్ట పరిహారం అందించాలని కోరారు. అదేవిధంగా నగరంలోని డ్రైనేజీ నీరు చెరువులో కలవకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్తగూడెం లో స్మశాన వాటిక లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మత్స్య శాఖాధికారులతో మాట్లాడి మత్స్యకారులు నష్టపోకుండా తగు చర్యలు తీసుకోవాలని నష్ట పరిహారం అందేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రావుల హన్మంతరావు, మత్స్య సొసైటీ ఛైర్మన్ ముద్రబోయిన అప్పారావు, చాగంటి వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# చట్టాల పట్ల అవగాహన అవసరం



### సీనియర్ న్యాయవాది గంటా విద్యాసాగర్ రెడ్డి

**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** మారుతున్న చట్టానికి అనుగుణంగా న్యాయవాదులు అధ్యయనం చేయాలని చట్టాల పట్ల అవగాహన ఉంటే ప్రజలకు న్యాయం జరుగుతుందని సీనియర్ న్యాయవాది గంటా విద్యాసాగర్ రెడ్డి తెలిపారు. ఐఎఎల్ ఆధ్వర్యంలో శనివారం ఖమ్మం డిపిఆర్‌సి భవనంలో న్యాయవాదులకు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్‌కె లతీఫ్, పి. అమర్‌చంద్, జివి లక్ష్మి నారాయణ, షేక్ నస్రీన్ లు అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విద్యాసాగర్ రెడ్డి మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నాటి ఇండియన్ పీనల్ కోడ్ 1860 క్రిమినల్ ప్రోసిజర్ కోడ్ 1973 ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారత న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యం చట్టం పేరుతో తీసుకు వచ్చిన చట్టాల గురించి ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఎల్ జాతీయ కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్, ఐఎఎల్ రాష్ట్ర అధ్యక్షులు పోట్ల మాధవరావు, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు దుస్సా జనార్ధన్‌రావు, ఐఎఎల్ జిల్లా కార్యదర్శి ఓరుగంటి శేషగిరి రావు, సీనియర్ నాయకులు పట్టాభి, కె. సత్యనారాయణ, ఏడునూతల శ్రీనివాసరావు, తిరుమల రావు, నేరెండ్ల శ్రీనివాసరావు, ఎండి ఫర్వేజ్, సతీష్, రాకేష్, మధు, సందీప్, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పది

### జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పించే ఉపాధ్యాయ వృత్తిని మించింది మరొకటి లేదని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ తెలిపారు. వి. వెంకటాయపాలెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేమిశెట్టి మోహన్ దాస్ పదవి విరమణ కార్యక్రమం శనివారం పాఠశాల ప్రాంగణంలో జరిగింది. దీనికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని హెచ్ఎం వేమిశెట్టి మోహన్ దాస్, సుగుణ దంపతులను ఘనంగా సన్మానించారు. పాఠశాల అభ్యున్నతికి మోహన్ దాస్ కృషిని గుర్తు చేశారు. ఉపాధ్యాయులతో స్నేహపూరిత వాతావరణంలో బోధన అందించడంలో మోహన్ దాస్ పాత్ర ఎనలేనిదన్నారు. ఎంఈవో ఎం. శ్రీనివాస్, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు, హైస్కూల్ హెచ్ఎం శ్రీమన్నారాయణ, ఎంపిటిసి యరగర్ల హన్మంతరావు, ఉపాధ్యాయులు రాయల నర్సింహారావు, పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో కలుషితమవుతున్న తాగునీరు..!

### -కార్యదర్శి నిర్లక్ష్యానికి రోగాల పాలవుతున్న ప్రజలు
### -గ్రామాలను కన్నెత్తి చూడని స్పెషల్ ఆఫీసర్



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** గ్రామాల్లో సర్పంచుల పదవీకాలం ముగియటంతో ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలలో ప్రజలు దుర్భర జీవితం గడుపుతున్నారు. అసలే వర్షాకాలం చినుకు పడితే చిత్తడిగా మారుతున్న గ్రామపంచాయతీలు మండల పరిధిలోని దమ్మాయిగూడం గ్రామ పంచాయతీలో గేటు వాల్వ్ లీకు అయ్యి గ్రామాలకు వెళ్లే మంచినీరు కలుస్తామవుతుంటే ఆ గ్రామపంచాయతీకి స్పెషల్ అధికారి ఒక్కరోజైనా కన్నెత్తి చూడలేదు దీనికి తోడు పంచాయతీ సెక్రెటరీ నిర్లక్ష్యంతో గ్రామంలో పారిశుద్ధం లోపించింది. ఇటీవల మంచినీటి బావిలో బ్లీచింగ్ అధికంగా వేయడంతో గ్రామ ప్రజలంతా చర్మ వ్యాధులతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంచినీటి పైపులు సుమారు నెల రోజుల నుండి దమ్మాయిగూడెం వెళ్లే మెయిన్ రోడ్డు ప్రక్కనే పైపులు పగిలి నీరు కారటంతో గేదెలు కుక్కలు నీటిని కలిసితం



చేయటంతో అదే నీటిని సరఫరా చేయటంతో గ్రామంలో ప్రజలు ఆ మంచినీటిని త్రాగి రోగాల బారిన పడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి శుభ్రపరచిన నీటిని అందిస్తున్నామని చెప్పినప్పటికీ అది ఆచరణ సాధ్యం కావట్లేదు పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించకుండా ఇష్టానుసారం విధులకు వస్తు గ్రామాల ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వెంటనే పగిలిన పైపులను మరమ్మతులు చేపట్టి దమ్మాయిగూడెం ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రమాదవశాత్తు బావిలో పడ్డ ట్రాక్టర్

### -భార్యభర్తలకు తీవ్ర గాయాలు
### -వైద్యం నిమిత్తం ఖమ్మం తరలింపు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలంలోని బైరవునిపల్లి లో ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో ట్రాక్టర్ పడింది. ఈ ప్రమాదంలో భార్య,భర్తలకు తీవ్ర గాయాలైయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని బైరవునిపల్లి కి చెందిన బాలిన వీరబాబు అనే రైతు గ్రామంలో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం సాగు చేస్తున్నాడు. బావిలో మోటారు ను బయటకు తీసేందుకు శనివారం ట్రాక్టర్ ద్వారా బయటకు లాగేందుకు తాళ్లు కట్టారు. భర్త బావిలో కి దిగి తాళ్లు కట్టి భార్య ను బయటకు గుంజేలా ట్రాక్టర్ ను



ముందుకు పోనీయని చెప్పటంతో తెలియక ట్రాక్టర్ గేర్ మారటంతో వెనక నుంచి వచ్చి బావిలో పడింది. బావిలో ఉన్న వీరబాబు ప్రమాన్ని గమనించి పక్కకు తప్పుకున్నాడు. ట్రాక్టర్‌లో ఉన్న మాధవి మాత్రం బావిలో పడటంతో బలంగా గాయాలైయ్యాయి. వెంటనే భర్త మాధవిని బయటకు తీస్తూ అరుపులు, కేకలు వేయటంతో చుట్టు పక్కల ఉన్న రైతులు గమనించి బావిలో పడ్డ ఇరువురిని బయటకు తీశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వారిని నేలకొండపల్లి ప్రభుత్వ హస్పిటల్ లో ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. బావిలో పడ్డ ట్రాక్టర్ ను ప్రోక్లెయిన్ ద్వారా బయటకు తీశారు.

## అన్నం పరబ్రహ్మ స్వరూపం



**ప్రజాపక్షం/ మధిర :** అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అన్నదానం చేసిన వారికి ఎంతో పుణ్యం వస్తుందని దాతలు పేర్కొన్నారు. శనివారం వర్తకసంఘంలో వేంచేసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం నందు అన్నగోవిందంలో భాగంగా యర్రా వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం భార్య భారతి, కుమారులు శ్రీనివాసరావు, మణికంఠ, హర్షవర్ధన్ సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆంథోనికి నివాళులర్పించిన లింగాల



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మండలం బయ్యారం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు మర్సకట్ల రాకేష్ తండ్రి మర్సకట్ల ఆంథోని ఇటీవల మృతి చెందాడు. శనివారం గ్రామంలో జరిగిన దశదిన కర్మకు జెడ్పి చైర్మన్ లింగాల కమల్‌రాజు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల కార్యదర్శి బొగ్గుల భాస్కర్‌రెడ్డి, గ్రామ నాయకులు, గ్రామస్థులు, కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అధికారులను అభినందించిన సిపి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం పోలీస్ కమిషనరేట్ లోని వివిధ పోలీస్ స్టేషన్లలో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్సై)లుగా బాధ్యతలు నిర్వహిస్తూ ఎస్సైలుగా పదోన్నతి పొందిన కట్టా సుబ్బారావు, జి. భీమా, విష్ణుమూర్తి, కె. సుబ్బారావు లను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ శనివారం అభినందించారు.

## నేడు మధిర మండలంలో భట్టి పర్యటన

**ప్రజాపక్షం/ మధిర :** మధిర మండలంలో పలు గ్రామాల్లో డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసేందుకు ఆదివారం పర్యటించనున్నారు. మండలంలోని వంగవీడు గ్రామంలో బోనకల్, ఆళ్ళపాడు, వంగవీడు బిటి రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం మండలంలోని చిలుకూరు గ్రామంలో శివాలయం వద్ద రూ.70లక్షలతో బిటి రోడ్డు నిర్మాణ పనులకు, చిలుకూరు నుండి దొడ్డదేవరపాడు బిటి రోడ్డు నిర్మాణ పనులకు తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు అధికసంఖ్యలో హాజరై భట్టి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

## సమ్మయ్య 3వ వర్ధంతి సందర్భంగా అన్నదానం



**ప్రజాపక్షం/వైరా:** మార్పు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఖమ్మం పట్టణానికి చెందిన అగ్రికల్చర్ అండ్ సెరికల్చర్ ఆఫీసర్ స్వర్గీయ పసుపులేటి సమ్మయ్య 3వ వర్ధంతి సందర్భంగా బోనకల్‌లోని మానసిక వికలాంగుల శరణాలయం శాంతి నిలయంలో నిర్వహించారు. శాంతినిలయంలో అనాథ దివ్యాంగులకు పసుపులేటి సమ్మయ్య భార్య పసుపులేటి కరుణ అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్లరజిత మాట్లాడుతూ అమ్మనాన్నలు లేని అనాథ దివ్యాంగ చిన్నారుల మధ్య తన భర్త పసుపులేటి సమ్మయ్య వర్ధంతిని నిర్వహించిన కరుణను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి కరుణ, శ్రీలక్ష్మి, సారిక, ప్రణవి, సమ్మయ్య, కుమారులు పసుపులేటిప్రశాంత్, పసుపులేటి వివేక్, శాంతి నిలయం నిర్వాహకులు సిస్టర్ ఆల్ఫే, సిస్టర్ బిజిలీ, సిస్టర్స్ శ్యామల, ప్రేమ, రోజా, లియా తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ తల్లి అమ్మవారి గుడి ద్వారబంధం కార్యక్రమానికి భక్తులు తరలిరావాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి సుబ్బయ్య చెరువు ఒడ్డున వెలిసిన శ్రీగంగమ్మ తల్లి అమ్మవారి గుడి ద్వారబందం పెట్టు కార్యక్రమానికి గ్రామ పెద్దలు ముహూర్తం ఖరారు చేశారు. జులై1న సోమవారం ఉదయం 9గంటలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకోవాలని కోరారు.

## విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి



**ప్రజాపక్షం/ తల్లాడ :** విద్యుత్ షాక్ గురై పాడి గేదె మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కేశవపురం గ్రామంలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన కట్టా విజయలక్ష్మి భర్త రోశయ్య అనే రైతుకు చెందిన పాడి గేదె రోజు లాగానే మేతకు వెళ్లే క్రమంలో గ్రామశివారులో గల వాగు సమీపంలో త్రి ఫేజ్ విద్యుత్ వైర్లు తెగిపోవడంతో తెగిన వైరు పాడి గేదెకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న బాధిత రైతు ఘటన స్థలానికి చేరుకుని విద్యుత్ అధికారులకు వెంటనే సమాచారం అందించగా విద్యుత్ సరఫరా నిలిపి వేటయం జరిగింది. సుమారు రూ.1లక్ష విలువ గల తన పాడి గేదె విద్యుత్ షాక్ గురై మృతి చెందడంతో జీవనాధారం కోల్పోయానని అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని బాధిత రైతు కోరుతున్నాడు.

## మాజీ మంత్రి శ్రీనివాస్ మృతి పట్ల సంతాపం

**ప్రజాపక్షం/ తల్లాడ :** నిజామాబాద్ బిజెపి ఎంపి ధర్మపురి అరవింద్ తండ్రి రాజకీయ దురంధురులు మాజీ మంత్రి డి.శ్రీనివాసరావు అకాల మృతి చెందటం పట్ల తల్లాడ మండల బిజెపి పార్టీ సంతాపం ప్రకటించింది. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, తెలంగాణ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన నాయకులు డి.శ్రీనివాస్ అని, తెలంగాణ సమాజానికి ఆయన లేనిలోటు తీర్చలేనిదన్నారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో బిజెపి మండల అధ్యక్షులు ఆపతి వెంకటరామారావు, ఎఎంసి మాజీ చైర్మన్ ధూపాటి భద్రరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు చల్లా నాగులు, గాదె కృష్ణ, యల్లంకి సుధాకర్, రాయల రమేష్, బాలాజీ నాయక్, ధూపాటి నరేష్, వాడవల్లి నాగేశ్వరరావు, తమ్మిశెట్టి కృష్ణ, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ విధానాల వల్ల పెరుగుతున్న నిరుద్యోగం



**ప్రజాపక్షం/వైరా:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానా లు మూలంగా నిరుద్యోగం, పేద రికం పెరిగిందని సిపిఎం జిల్లా కార్య దర్శి వర్గ సభ్యులుబొంతు రాంబాబు అన్నారు. శనివారం పాలడుగు గ్రా మంలోజరిగిన వైరా మండల సిపిఎం శిక్షణ తరగతులు సందర్భంగా సిపిఎంజెండాను షేక్ అబ్దుల్‌రెహ్మాన్ ఆవిష్కరించారు. ఈ రాజకీయ శిక్షణా తరగతుల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు వర్గమాన రాజకీయ ఆర్థిక రాజకీయ పరిస్థితులపై ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 30లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా భర్తీ చేయడం లేదని అన్నారు. దేశంలో మొదటిసారి ప్రతిష్టాత్మక ఐఐటిలో చదువుతున్న విద్యార్థులకు కూడా క్యాంపస్ సెలెక్షన్‌లో ఉద్యోగాలు రావడం లేదనే వార్తలు దేశ యువత భయాందోళనకు గురి చేస్తుందన్నారు. ఈ తరగతులకు బోడపట్ల రవి, మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, సీనియర్ నాయకులు వనమా చిన్న సత్యనారాయణ, మండల కార్యదర్శి వర్గ సభ్యులు తూము సుధాకర్, కిలారు శ్రీనివాసరావు, శీలం వెంకటరెడ్డి, జెర్రిపోతుల పుష్పరాజ్యం, జయరాజు, షైనాబీ, సుధాకర్, ప్రభాకర్, నల్లమల కోటేశ్వరరావు, చింతనిప్పుచంద్రరావు, మేడా శరబంది, బుగ్గ వెంకటేశ్వరరావు, షేక్ మౌలాలి, రెహానా, మజీద్‌బీ, ఫాతిమా, రామయ్య, రాజబాబు, సామినేని వెంకటేశ్వరరావు, బిలాల్, ఎస్ఎఫ్ఐ వైరా డివిజన్ అధ్యక్షులు పుప్పాల నాగరాజు, కార్యదర్శి కోటప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## న్యూజెర్సీ టీషర్ట్స్ పంపిణీ



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి గ్రామానికి చెందిన క్రికెట్ టీం ప్లేయర్స్‌కు న్యూజెర్సీ టీషర్ట్స్‌ని సింగరేణి మండల యువ నాయకుడు మేదరి టోని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కారేపల్లి టీం ప్లేయర్లు ఆదర్ల హరి, నాగి, జూన్వెస్లీ, అమీర్, కాకటి సాయి, పెద్దమ్మ, వెంకటేశ్, తురక అనిల్, సాంబ, సాయి, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాత మోమున చిరునవ్వు..!






**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రభుత్వం అన్నదాతలకు తీపి కబురు అందించింది. రూ.2 లక్షల వరకు రుణమాఫీ ని మరి కొద్ది రోజులలో అమలు చేయనుండటంతో రైతుల ఆనందం వెల్లివిరిస్తుంది. జిల్లాలో అత్యధికంగా రైతులు, ప్రజలు చెరువు ను నమ్ముకుని సేద్యాన్ని నమ్ముకుని జీవిస్తున్నారు. చెరువులు, కుంటలు బోరు బావులు కింద వరి, కంది, పత్తి, మొక్కజొన్న, చెరకు తదితర పంటలు సాగు చేస్తున్నారు. ఈ పంటల కు పెట్టుబడులకు వివిధ బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నుంచి తీసుకుంటున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు సీఎం రేవంత్‌రెడ్డి గత శుక్రవారం మంత్రి వర్గం సమావేశంలో రుణమాఫీ పై చర్చించి అము చేస్తామని ప్రకటించారు. దీంతో జిల్లాలో లక్షల మందికి పైగా రైతులకు లబ్ధి చేకూరనుంది. రూ.2 లక్షల రుణమాఫీ కి కటాఫ్ తేదిని ప్రకటించారు. 2018, డిసెంబర్ 12, నుంచి 2023, డిసెంబర్ 9 వరకు మధ్య తీసుకున్న రైతులకు లబ్ధి చెందనున్నది. ప్రభుత్వం నిర్ణయంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి రుణమాఫీ పై విధి విధానాల మరి కొద్ది రోజులలో రానున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

**సర్కార్ నిర్ణయం తో రైతులలో వెల్లువిరిస్తున్న ఆనందం...**

తెలంగాణ ప్రభుత్వం రుణమాఫీ విషయంలో తీసుకున్న నిర్ణయం పట్ల ఖమ్మం ఉమ్మడి జిల్లా రైతాంగం లో ఆనందం వెల్లువిరిస్తుంది. గతంలో రుణాలు తీసుకున్న రైతులకు కొన్నేళ్లు గా మాఫీ కోసం ఎదురు చూస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగు విడతలు గా రుణమాఫీ చేస్తామని ప్రకటించి అమలు చేసింది. తొలి విడతలో రూ.25 వేలు, రెండో విడతలో రూ.50 వేల లోపు వారికి మాఫీ చేసింది. ఆ తరువాత ఆచరణ సాధ్యం కాకపోవటంతో రుణాలు అలాగే ఉండిపోయాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తుండటంతో రైతుల సంతోషంలో ఉన్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో లక్షల మంది రైతాంగం కు లబ్ధి చేకూరుతుంది. దీంతో ప్రభుత్వం కు రైతాంగం కృతజ్ఞతలు తెలిపింది.

**ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంది....శాఖమూరి రమేష్, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్, నేలకొండపల్లి.**



ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు కు కట్టుబడి ఉంది. అందులో భాగంగానే ఏకకాలంలో రూ.2 లక్షల రుణ మాఫీ ని అమలు చేయనున్నది. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను మొత్తం దశల వారీగా అమలు చేసుకుంటూ వస్తుంది. కాంగ్రెస్ మాట ఇస్తే అమలు చేసి తీరుతుంది. రైతులు చాలా సంతోషంగా ఉన్నారు.,

**ఎక్కువ మందికి ప్రయోజనం : మేకల వెంకటేశ్వర్లు, రైతు, కోనాయిగూడెం.**



ఏకకాలంలో రుణమాఫీకి నిర్ణయం తీసుకోవటం సంతోషంగా ఉంది. ఎక్కువ మంది రైతులకు లబ్ధి కలిగించేలా మార్గదర్శకాలు రూపొందిచాలి. ఈ ప్రభుత్వంకు రైతులు రుణపడి ఉంటారు. రైతాంగం అంతా ఆనందంగా ఉంది. మంత్రి వర్గం కు ధన్యవాదాలు.

**రూ.2 లక్షలు రుణం తీసుకున్నా : ఆనం వెంకటరెడ్డి, రైతు, అనంతనగర్.**



బ్యాంకు నుంచి రూ.2 లక్షల రుణం తీసుకున్నాను. ప్రభుత్వం నిర్ణయం వలన రుణమాఫీ అవుతుంది. చాలా సంతోషంగా ఉంది. రైతులకు చాలా ప్రయోజనం కలుగుతుంది. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న ఎందరో రైతులకు లబ్ధి చేకూరుతుంది. ఇచ్చిన మాట నిలబెట్టుకోవటం సంతోషదాయకం.

## విద్యుత్ సమస్యలను నిరసిస్తూ రైతుల నిరసన

**విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడిస్తాం**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని చెరువుమాధారం రైతులు విద్యుత్ సమస్య తో తల్లడిల్లితున్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వలన గ్రామంలో 10 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి 20 రోజులు అవుతున్నా పట్టించుకోవటం లేదని రైతులు ఆరోపిస్తూ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద శనివారం రైతులు నిరసన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన కల్లెం కృష్ణారెడ్డి, శేఖర్, ఈవూరి శ్రీనివాసరెడ్డి, కాటం వెంకటరెడ్డి, మరికంటి గోపి, పగిడిపత్తి శ్రీనివాస్‌రావు, పేరుబోయిన సైదులు, తెల్లగొర్ల కోటయ్య, బెల్లంకొండ లక్ష్మినారాయణ తదితర రైతులకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్స్ కాలిపోయి 20 రోజులు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున్న నాట్లు పోసుకుని సిద్ధంగా ఉన్నామని రైతులు అగ్రహం వ్యక్తం చేశారు. కరెంట్ సరఫరా లేక నారు మళ్లు ఎండిపోతున్నాయని అవేదన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటామని పేర్కోన్నారు.ఈ సందర్భంగా రైతు ప్రతినిధి ఈవూరి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు...రైతుల పట్ల విద్యుత్ నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని అన్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టకపోతే విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. అదే విధంగా గ్రామాలకు విద్యుత్ సరఫరా కాకుండా నిలిపివేసి నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## మణుగూరు సింగరేణి ఏరియా ఆసుపత్రిపై పట్టింపేది..?

**సోషల్ మీడియా వేదికగా ఆవేదన వ్యక్తం చేస్తున్న కార్మికులు**




**ప్రజాపక్షం/ఖమ్మం :** మణుగూరు సింగరేణి ఏరియా పరిధిలో ఉన్నటువంటి పీవీ కాలనీ ఏరియా హాస్పిటల్ లో నిత్యం విద్యుత్ సరఫరా అంతరాయాలు ఏర్పడుతున్నాయని, మౌలిక వసతులు లేక ఇబ్బందులకు రోగులు ఇబ్బందులకు గురవుతున్నా, క్యాజువాలిటీలో పనిచేయని ఇన్వర్టర్లు పెట్టి వాటితోనే హాస్పటల్ నడిపిస్తున్నారనీ కార్మిక కుటుంబాలు ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా విస్తృత ప్రచారం కూడా నడుస్తున్నది. క్యాజువాలిటీలో పనిచేయని ఏసీలు పెట్టి ఏదైనా ఎమర్జెన్సీ వస్తే కార్మికులు నానా అవస్థలు పడుతున్నారనీ ఎన్నిసార్లు హాస్పిటల్ ఉప ముఖ్యవైద్యాధికారిణికి చెప్పినా చెవిటి వారి ముందు శంఖం ఊదినట్లుగా నిర్లక్ష్యంగా మేడం వ్యవహరిస్తున్నారని, ఏది అడిగినా శేషగిరి డాక్టర్‌ని అడగండి అంటూ పొడి పొడి సమాధానం ఇస్తున్నారని కార్మికుల ఆరోపిస్తున్నారు. సమస్యల నిలయంగా మారిన ఏరియా హాస్పిటల్ పై స్పందించే నాయకులే కరువయ్యారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏరియా బాస్ కి ఇవేవీ పట్టవు గనుక, ఏరియా హాస్పిటల్ లో వైద్య సేవలు మెరుగుపరచేటందుకు, దొంగతనాల నివారణకు సీసీ కెమెరాల ఏర్పాటుకు ఏరియా గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలతో పాటు ఇతర కార్మిక సంఘాలు కూడా స్పందించి పరిష్కారానికి కృషి చేయాలని ఏరియా కార్మికులు, కార్మిక కుటుంబాలు ముక్త కంఠంతో కోరుతున్నారు.

# ఇంకా మేము అడవిలోనే బతకాలా..?

**-గుట్టల్లో ఉండేవాళ్ళు గుట్టలకే పరిమితమా...?**
**-చదువులకు అడ్డంకిగా మారిన కుల ధృవీకరణ పత్రాలు**



**ప్రజాపక్షం/కరకగూడెం:** రెండు దశాబ్దాల కాలం నుంచి ఛత్తీస్‌ఘఢ్ ప్రాంతం నుంచి వలస వచ్చి కరకగూడెం మండలంలోని గుత్తికోయల గూడాలైన అశ్వాపురం, అంగరూగూడెం, రేగళ్ళ, నీలాద్రీ పేట, భాగ్య నగరం వంటి గూడెల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న ఛత్తీస్‌గఢ్ వలస ఆదివాసులు అడవులకే పరిమితమయ్యే పరిస్థితులు దాపురిస్తున్నాయి. ఇప్పడిప్పుడే ఆయా గూడేలలోని పిల్లలు చదువులకు వెళుతూ, హాస్టల్లో చేరి విద్యాభ్యాసంతో గిరిజన గుడాల్లో కొంత చైతన్యం వెల్లి విరుస్తోంది. స్థానిక ప్రజలతో మమేకమై నాగరిక సమాజంలోకి పరుగెడుతున్నారు. ఆయా గూడెలలో చదువుకున్న విద్యార్థుల సంఖ్య పెరగడంతోనే వారి యొక్క జీవన ప్రమాణాలలో కొంత మార్పు కనిపిస్తుంది. కొన్ని గ్రామాలలో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో స్కూల్ నిర్వహణ చేయడం ద్వారా పదో తరగతి దాకా చదువుకున్నారు. కొంత మంది ఉన్నత విద్యను అభ్యసించాలనే కోరిక ఉన్నప్పటికీ వారికి కుల ధృవీకరణ పత్రం జారీ చేయకపోవడం ద్వారా వారి చదువులకు ప్రధాన అడ్డంకిగా మారడంతో చదువును కొనసాగించలేక మధ్యలోనే చదువును ఆపేస్తున్నారు. పొట్ట కూటి కోసం కూలీ చేసుకొని బతికే పేద బ్రతుకులు అటువంటి తరుణంలో తమ కుటుంబ పోషణకు చిన్నపిల్లలు కూడా కూలీ పనులకు వెళ్లే పరిస్థితి ఆయా గూడాలలో నిత్యం కనిపిస్తుంది. ఇప్పుడిప్పుడే స్థానిక గిరిజనులతో పాటుగా బడికి వెళ్లాలని కోరికతో వెళ్తున్నారు.వారికి 10 తరగతి ఉత్తీర్ణత పొంది ఇంటర్మీడియట్ వరకు వెళ్లే సరికి ఉపకార వేతనానికి దరఖాస్తు చేసుకునే క్రమంలో కుల ధృవీకరణ పత్రం కావాల్సి వస్తుంది. ధృవీకరణ పత్రం కోసం తహాశీల్దార్ కార్యాలయంలో ఇతర అధికారులకు మొరపెట్టుకునా ఎవరూ వారి సమస్య పట్టించుకోవడం లేదని ఆయా గూడేకు చెందిన గిరిజనులు వాపోతున్నారు. కుల ధృవీకరణ పత్రం ఇవ్వాలని ఆయా గిరిజనులు కోరుతున్నారు. తమ పిల్లలకు ఉన్నత చదువులు చదువుకునే అవకాశం కల్పించాలని ఆయా గిరిజనులు వేడుకుంటున్నారు.

**చదువుకోవాలని ఉంది : మడివి శాంతి**



నాకు ఉన్నత చదువులు చదువుకో వాలని ఉంది. నేను పదో తరగతి వరకు మణుగూరులో చదివి ఉత్తీర్ణ సాధించాను. డిగ్రీ జాయిన్ అవ్వాలని ఉపకార వేత నానికి కుల ధృవీకరణ పత్రం అడుగుతుండటంతో దాని కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకుని తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి అడగితే ఇవ్వడం కుదరదని అంటున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. నాకు ఇంకా చదువుకోవాలని ఉంది. కానీ కుల ధ్రువీకరణ పత్రాలు లేక మా గ్రామాల్లో 8 మంది దాకా చదువుకోవడం బంద్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మాకు కుల ధ్రువీకరణ పత్రాలు అందించాలని ప్రభుత్వాన్ని మడివి శాంతి కోరుతుంది.

**మా సమస్యను పరిష్కరించాలి : పోడియం శ్రీను**



అశ్వాపురం గ్రామం నుంచి చదువుల కోసం చాలా మంది వెళ్లాలని చూస్తున్నామని పోడియం శ్రీను తెలిపారు. కానీ మాకు కుల ధృవీకరణ పత్రం చాలా పెద్ద సమస్యగా మారిందని, మా ఈ సమస్య పరిష్కరించి మా చదువుకు అవకాశం కల్పిస్తే మా కుటుంబాలను చక్క దిద్దుకునే అవకాశం ఉంటుందని, అధికారులు మా సమస్యను పరిష్కరాలని కోరారు.

**రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి : ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రేమ్ కుమార్**



ఛత్తీస్‌ఘఢ్ వలస ఆదివాసీల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని, వారి పిల్లల చదువులపై దృష్టి సారించాలని ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రేమ్ కుమార్ అన్నారు. జనావాసాలకు దూరంగా ఉన్న గ్రామాల్లో ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేయాలని, ఇది వరకే ఏర్పాటు చేసిన అంగన్ వాడీ కేంద్రాలను నామ మాత్రంగా కొనసాగిస్తున్నారని మార్పు రావాలని తెలిపారు. చదువులకు ఎటువంటి ఆటంకం లేకుండా కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. తక్ష ణమే వారి కుల ధ్రువీకరణ పత్రాల సమస్యను పరిష్కరించాలని తెలిపారు.

**కుల ధృవీకరణ పత్రం ఇవ్వడం కుదరదు : తహాశీల్దార్ నాగ ప్రసాద్**



రాష్ట్ర ప్రభుత్వ జిఓ ప్రకారం ఆధార్ కార్డు, పాన్ కార్డు, విద్యుత్ మీటర్లు, రేషన్ కార్డు ఇవ్వడం వీలు పడుతుందని, కానీ కుల ధృవీ కరణ పత్రం మాత్రం ఇవ్వడం కుదరదని తహశీల్దార్ నాగ ప్రసాద్ ప్రజాపక్షం కు తెలి పారు. అధికారుల నుంచి ఎటువంటి ఆదేశాలు వచ్చినా అమలు చేస్తామన్నారు.

## యువత రాజకీయాల్లోకి రావాలి..

**- సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు**





**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** యువత రాజకీయాల్లోకి రావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం నగరంలోని మంచికంటిహాల్లో ఖమ్మం రూరల్ మండల సీపీఎం శిక్షణ తరగతులు ఈనెల 29,30 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ శిక్షత రగతుల్లో భాగంగా మొదటి రోజు శిక్షణ తరగతులను శనివారం నున్నా ప్రారంభించారు. తొలుత అక్కడ ఏర్పాటు చేసిన ఆరుణపతాకాన్ని సీపీఎం సీనియర్ నాయకులు అద్దంకి తిరుమలయ్య ఆవిష్కరించారు. అనంతరం సీపీఎం రూరల్ మండల కార్యదర్శి నంద్ర ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన మొదటి క్లాసును నున్నా నాగేశ్వరరావు బోధించారు. డబ్బుతో ముడిపడిన నేటి రాజకీయాల్లో విలువలు కొరవడినవని, వ్యాపారవేత్తలు రాజకీయాల్లోకి రావడంతో డబ్బుకు అడ్డు,అదుపు లేకుండా పోయిందన్నారు. యువత రాజకీయాల్లోకి వచ్చి భ్రష్టు పట్టిన రాజకీయాలను నీతివంతం చేయాలని కోరారు. ఎన్నికల్లో గెలిచేందుకు సాధ్యం కాని హామీలనిచ్చి, అబద్ధాలు, మాయమాటలు, పుకార్లతో గద్దెనెక్కడమే లక్ష్యంగా బూర్జువా పార్టీలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. మీడియాలతో, సోషల్ మీడియాలో అబద్ధాలు దుష్ప్రచారాలు ప్రచారం చేస్తూ వాళ్లకు గిట్టని వారిపై నిందలు వేస్తూ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. యువత తలుచుకుంటే ప్రభుత్వాలే దిగిపోతాయని అంతటి మహత్తరమైన శక్తి యువతకే ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేసులు, నిర్బంధాలు ఎదురైన ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసేది సీపీఎం మాత్రమేనని అన్నారు. కమ్యూనిస్టులను ఎదగనీయకుండా అడ్డుకునేందుకు ఎన్నో అశాస్త్రీయమైన ఆరోపణలు చేస్తూ, ప్రజలను పక్కదారి పట్టిస్తుంటారని, ప్రత్యేకంగా ఎన్నికల సమయంలో కమ్యూనిస్టు పార్టీలపై నిందలు వేస్తూ పబ్బం గడుపుకుంటారని, వాటిని పరిగణలోకి తీసుకోవద్దని ప్రజలకు తెలిపారు.


**ఆర్థిక విధానాలు-ప్రజలపై ప్రభావం...**

ఈ అంశంపై క్లాస్‌ను సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్ బోధించారు. ప్రపంచీకరణ, సరళీకృత విధానాలు ప్రజలను ఎలా మభ్యపెడతాయో సులువైన పద్ధతుల్లో వివరించారు. భవిష్యత్‌లో కమ్యూనిస్టులకు మంచి రోజులు వస్తాయని, కమ్యూనిస్టు పార్టీలకు గడ్డు పరిస్థితులు సహజమని, ఎటువంటి పరిస్థితుల్లోనైనా ఎదురొడ్డి నిలబడటమే కమ్యూనిస్టుల లక్ష్యమన్నారు. దేశంలో పెట్టుబడిదారులు చేస్తున్న మోసాలను కళ్లకు కట్టినట్లు చెప్పారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసి, ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహించడమే బూర్జువా పార్టీల లక్ష్యమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం పాటుపడటమే కమ్యూనిస్టుల ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పాలేరు నియోజకవర్గ ఇన్చార్జ్ బుగ్గవీటి సరళ, సీపీఎం సీనియర్ నాయకులు బత్తినేని వెంకటేశ్వరరావు, నాయకులు ఊరడీ సుదర్శన్‌రెడ్డి, షేక్ బషీరుద్దీన్, పి.మోహమోహన్‌రావు, పి.సంగయ్య, నందిగామ కృష్ణ, పెండ్యాల సుమతి, యామిని ఉపేందర్, పొన్నం వెంకటరమణ, సిలివేరు బాబు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీల్లో పైసల్లేవు..!

**-నిధుల లేమితో ఇబ్బందులు పడుతున్న గ్రామాలు**
**-కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్న ప్రజలు**
**-పారిశుద్ధ్యం లోపించిన పట్టించుకోని వైనం**
**-పత్తాలేని 15వ ఆర్థిక సంఘం నిధులు**
**-ముందుకు సాగని అభివృద్ధి పనులు**
**-జీపీ కార్మికులకు వేతనాలు ఇవ్వలేని దుస్థితి**







**ప్రజాపక్షం/బూర్గంపాడు:** దేశానికి పట్టుకొమ్మలు పల్లెలు అయితే, ఆపల్లెల్లో పైసల్లేక పలు అభివృద్ధి పనులు నోచుకోవడం లేదు. ఫిబ్రవరి 1న గ్రామ పంచాయితీ పాలకవర్గం పదవీ కాలం ముగియడంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. ప్రత్యేకాధికారులను కేటాయించారు కానీ నిధులు లేమితో వాటి పరిష్కారం చూపలేకపోతున్నారు... గ్రామ పంచాయితీలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ నిధులు కూడా ఖాజానాలో పాస్ కావడం లేదని అధికారులు చెబుతున్నారు. నిధులు పాస్ కాకుండా ఫ్రీజింగ్ కారణమైనప్పటికి తాత్కాలిక మరమ్మతు పనులకు కావాల్సిన నిధులు విడుదల కాకపోవడంతో గ్రామాల్లో ఇబ్బందులు తలెత్తున్నాయి. నిధులు సైతం రాకపోవడంతో మరింతాగా గ్రామ పంచాయితీలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. గ్రామ పంచాయితీ కార్మికులు వేతనాలు, సీసీ చార్జెస్, ప్రతి నెల ఈఎంఐలు, ట్రాక్టర్‌కు నిత్యం చెత్త సేకరణ కోసం కావాల్సిన డిజీల్ ఖర్చులు, విధీలైట్లు అమర్చుట, మురికి కాల్వల శుభ్రం చేయుట. వాటర్ ట్యాంక్‌లను బ్లీచింగ్ శుభ్రం చేయుట లాంటి పనులకు నిధుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. అంతే కాకుండా కొన్ని గ్రామాల్లో మిషన్ భగీరత నీరు రాకపోవడంతో కానీకి ఒక బోరు వేమటార్‌ను ఏర్పాటు చేయగా, అవి కాస్త నిత్యం నడవడంతో కాలిపోయిన సందర్భాల్లో వాటి మరమ్మతులకు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. బూర్గంపాడు మండలంలో 18 గ్రామ పంచాయితీలో మేజర్ గ్రామ పంచాయితీలు తప్ప మిగిలిన అన్ని గ్రామ పంచాయితీలకు నిధులు కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. రోజు వారి కార్యక్రమాలకు సైతం ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి ఆర్థిక సంఘం నిధులు సకాలంలో అందక పంచాయితీలు అవస్థలు పడే పరిస్థితి దాపురించింది. గత ఏడాదిగా 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కాకపోవడంతో పంచాయితీల నిర్వహణ భారంగా మారింది. గత ప్రభుత్వం కేంద్రం నుండి వచ్చే నిధులు పక్కాదారి పట్టిస్తుందనే ఉద్దేశ్యంతో ఆర్థిక సంఘం నిధులు విడుదల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. గ్రామ పంచాయితీలను కొత్త బ్యాంక్ ఖాతాలు తెరవాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో గతంలోనే పంచాయితీలు కొత్త పాస్ పుస్తకాలను సైతం తెరిచారు. ఆర్థిక సంఘం నిధులు వినియోగం కోసం పంచాయితీలకు డిజిటల్ కీలను అందించారు. 4 నెలలుగా కేంద్రం నిధులను విడుదల చేయడం లేదు. కేంద్ర ప్రభుత్వం నిధులు లేకపోవడంతో ఎస్ఎఫ్‌సీ నిధులే పంచాయితీలకు దిక్కాయ్యాయి. కానీ ఆ నిధులు ట్రేజరీలో మాత్రం పాస్ కావడం లేదని అధికారులు మొత్తుకుంటున్నారు. పంచాయితీలకు సకాలంలో నిధులు రాక, చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో అభివృద్ధి పనులతో పాటు పారిశుద్ధ్య పనులు సైతం ముందుకు సాగడం లేదు. నిధుల కొరత తీవ్రంగా ఉండగా, పల్లెల్లో ప్రజలకు కావాల్సిన సౌకర్యాలను కల్పించడంలో పూర్తిగా విఫలమవుతున్నామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పల్లెలకు కావాల్సిన నిధులను వెంటనే సమకూర్చి, కనీస అవసరాలకు పలు అభివృద్ధి పనులకు, పంచాయితీల నిర్వహణల కోసం నిధులు విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.


# ఫీజుల భారం..!

-నర్సరీ ఎల్కేజీల్లోనే కేజీల కొద్దీ పాఠ్యపుస్తకాలు
-స్కూల్ బ్యాగ్ మోయలేక కుంగిపోతున్న చిన్నారుల భుజాలు
-ప్రైవేట్ పాఠశాలలో అమలు కానీ జీవో నెంబర్ 22
-పర్యవేక్షించని విద్యాశాఖ అధికారులు
-స్కూల్ యూనిఫామ్, బెల్టు, టైలు యథేచ్ఛగా అమ్మకాలు
-ఇవేమీ పట్టించుకోకుండా రెన్యువల్ చేస్తున్న అధికారులు

**ప్రభుత్వ నిబంధన ప్రకారం ప్రైవేట్ పాఠశాలలు నడుచుకోవాల్సింది పోయి ఇష్టమొచ్చిన రీతిలో ఫీజులు వసూలు చేస్తున్నారు. అనర్హులైన ఉపాధ్యాయులచే విద్యను బోధించడం పాఠశాలలో బుక్స్, యూనిఫామ్, టైలు, బెల్ట్‌లు అమ్ముకోవడం చేస్తుండగా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. బూర్గంపాడు మండలంలోని సారపాక 7, బూర్గంపాడు 2, మోరంపల్లిబంజర్ 2, లక్ష్మీపురంలో 1, రెడ్డిపాలెంలో 2 మొత్తం 14 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి.**





**ప్రజాపక్షం/బూర్గంపాడు:** పిల్లలను ఉన్నత స్థానంలో చూడాలని తల్లిదండ్రులు కలలు కంటారు కానీ ప్రైవేట్ పాఠశాలలో చదువును అమ్ముతున్నారు. వారి చదువుల కోసం ఎన్నో ఆశలతో మంచి బడుల కోసం తల్లిదండ్రులు అన్వేసిస్తారు. దీన్ని ఆసరాగా చేసుకున్న ప్రైవేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా స్కూలు ఫీజులతో పాటు, డజన్ల కొద్దీ పుస్తకాలు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో పసి వయసులోనే చిన్నారులు బండెడు పుస్తకాలు మోయాల్సి వస్తుంది. ఈ పుస్తకాల బ్యాగులు మోయలేక వారి లేత భుజాలు కుంగిపోతున్నాయి. నిరంతరం తనిఖీలు ప్రైవేట్ పాఠశాలలో విద్యాధికారులు జరుపుతున్నారా లేదా అని తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా ప్రతి పాఠశాలలో ఫైర్ సేఫ్టీ పరికరాలు ఉపయోగించాలి, రెండు మూడు అంతస్తు భవనాలలో రైలింగ్ ఉండాలి. దాని వల్ల పిల్లలు కింద పడకుండా జాగ్రత్తగా ఉండాలని అవకాశం ఉంటుంది. ఈ సంబంధలు ఎంత వరకు పాటిస్తున్నారో తెలియడం లేదు.

**2017 జీవో ఏం చెప్తుంది...**

విద్యార్థులు వీపుపై బండెడు బరువు తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం 2017లో జీవో నెంబర్ 22ను విడుదల చేసింది. దీని ప్రకారం ఒకటి నుండి రెండో తరగతి విద్యార్థులకు పుస్తకాల బురువను కిలోన్నర వరకు మాత్రమే ఉండాలి. మూడు నుండి 5వ తరగతి వారికి నాలుగు కిలోలు, 8,9 తరగతి వారికి నాలుగు, ఐదు కిలోలు, పదవ తరగతి వారికి ఐదు కిలోల బరువు మాత్రమే ఉండాలని సూచించారు. ఎన్సీ ఈఆర్టీ ప్రకారం ప్రభుత్వం జారీ చేసిన పుస్తకాలు వినియోగించాల్సి ఉంటుంది. హోం వర్క్ పేరిట ట్యూషన్లు స్పెషల్ క్లాసులు పెట్టకూడదు. ఆటపాటలతో చదువు సాగించాలి. విద్యార్థులకు వాటర్ బాటిల్ బరువు లేకుండా పాఠశాలలోనే మంచినీరు అందించాలి. ఐదవ తరగతి వరకు హోం వర్క్ ఉండకూడదని జీవోలు పేర్కొన్నారు. అయినా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో జీవో అమలుకు నోచుకోవడం లేదు.

**మోతాదును మించిన పుస్తకాల బరువు...**

పాఠశాలలో ఒకప్పుడు ఆరు సబ్జెక్టులకు ఆరు నోట్ బుక్స్‌తో పాటు ఒక రఫ్ బుక్ ఉండేది. కానీ ఇప్పుడు సబ్జెక్టుకు ఒక రఫ్ బుక్‌తో పాటు గైడ్లు, డ్రాయింగ్ స్క్రాప్ బుక్స్, రికార్డులు, డైరీలు కలుపుకొని కిలోల కొద్దీ పుస్తకాలను స్కూల్ బ్యాగుల్లో మోసుకెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. రోజు 10కిలోల బరువు కంటే ఎక్కువగా చిన్నారులు తమ భూజాలపై మోస్తున్నారు. అంతే కాక ఒకటి రెండు అంతస్తుల బిల్డింగులు ఎక్కి క్లాస్ రూమ్ వరకు వెళుతుండటంతో చాలా మంది పిల్లలు వెన్నునొప్పి జాయింట్ ఫెయిన్స్ బారిన పడుతున్నారు. దీంతో విద్యార్థుల శారీరక ఎదుగుదలపై ప్రభావం పడుతుంది.

**మానసిక నిపుణులు ఏమంటున్నారు...**

మానసిక నిపుణుల ప్రకారం అధిక బరువుతో మానసిక ఆందోళనను గురవుతారు. త్వరగా ఆలసిపోయి చదువుపై శ్రద్ధ పెట్టలేరని చెప్తున్నారు. అదే విధంగా నడుము, వెన్ను, కండరాల నొప్పి వచ్చే ఆస్కారం ఉంటుందని వయసుకు తగిన బరువును మాత్రమే మోయాలని మానసిక నిపుణులు చెప్తున్నారు.

**ప్రైవేట్ స్కూళ్లలో ప్రచార ఆర్భాటాలు...**

ప్రైవేట్ స్కూలు తమ పాఠశాలలను పబ్లిసిటి చేసుకోవడానికి రకరకాలుగా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. ఈ మధ్య కొత్త ట్రెండు మొదలైంది. ఇంటింటికి తిరిగి ప్రచారంతో పాటు, మా స్కూల్‌లో గొప్పతనం ఉన్నవి హడావిడి చేసి తప్పుడు ప్రచారాలను సైతం చేసి పిల్లలను, తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నారు. దీనికి లక్షల్లో ఖర్చు అవుతుందని అంచనా, ఇది కూడా పిల్లల తల్లిదండ్రుల మీద మోపెయ్యడం గమనర్హం. ఇంత జరుగుతు అధికారులు పట్టించుకోకపోవడం కొస మెరుపు...

## ఖమ్మం వైద్య చరిత్రలో మైలురాయి

**మొదటిసారిగా టిఏవిఆర్ విధానం విజయవంతం : డాక్టర్ పేర్ల హర్షతేజ**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం వైద్య రంగంలో ఒక వినూత్నమైన ప్రయోగం విజయవంతమైంది. ఖమ్మం నగరంలోని వెంకటేశ్వర హాస్పిటల్ లో ఖమ్మంకు చెందిన కళావతి అనే 70 ఏళ్ల వృద్ధ మహిళకు క్రిటికల్ కార్డియాక్ కండిషన్‌ను అత్యాధునిక ట్రాన్స్ క్యాథెటర్ అయోటిక్ వాల్ రిప్లేస్‌మెంట్ (టిఏవిఆర్) విధానం ద్వారా విజయవంతంగా చికిత్స పూర్తి చేసినట్లు ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పేర్ల హర్షతేజ తెలిపారు. శనివారం ఖమ్మంలోని శ్రీ వెంకటేశ్వర హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ హర్ష తేజ మాట్లాడుతూ తీవ్రమైన గుండె వైఫల్యం, అధిక రక్త పోటుతో బాధపడుతున్న కళావతికి కోమోరబిడిటిల కారణంగా సంప్రదాయ ఓపెన్ హార్ట్ సర్జరీ తో గణనీయమైన నష్టాలను ఎదుర్కొనే అవకాశం ఉన్నందున తక్కువ ఇన్వెసివ్ విధానం అవసరాన్ని గుర్తించి టిఏవిఆర్ విధానాన్ని ఎంచుకున్నామని ఇది తోడ ధమని ద్వారా (రక్త నాళం) ద్వారా నిర్వహించబడుతుందని టిఏవిఆర్ పద్ధతిలో వ్యాధిగ్రస్తమైన విఫలమైన బృహద్ధమని కవాటాన్ని క్యాథెటార్ ద్వారా మార్పిడి చేయడం తద్వారా ఓపెన్ హార్ట్ సర్జరీని నివారించడం జరుగుతుందన్నారు. ఈ పద్ధతి అధిక ప్రమాదం ఉన్న రోగులకు ప్రత్యేకంగా ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అతి త్వరగా కోలుకుని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అవ్వడానికి సురక్షితమైన ప్రత్యామ్నాయాన్ని అందిస్తుందన్నారు. తన నైపుణ్యంతో ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. ప్రక్రియ తర్వాత రోగి వాల్ లోపం లేకుండా అద్భుతమైన రికవరిని పొందారన్నారు. ఆమె పరిస్థితి నిలకడగా ఉందని మందుల సహాయంతో ఆమె త్వరగా సాధారణ జీవితానికి తిరిగి వచ్చిందన్నారు. ప్రాణాలను కాపాడే ప్రక్రియల పట్ల నిబద్ధతను నొక్కిచెప్పే సంచలనాత్మక కేసు ఖమ్మంలో మొట్ట మొదటిసారిగా జరిగిందన్నారు. ఈ చికిత్స విధానం సాధారణంగా హైదరాబాద్ లాంటి మెట్రో నగరాల్లో, ప్రధాన పట్టణాల్లో 20 నుండి 35 లక్షల మధ్యలో ఖర్చు అవుతుందని మొదటి సారిగా తక్కువ ఖర్చుతో అత్యాధునిక వైద్య సేవలు అందించడంలో వెంకటేశ్వర హాస్పిటల్ అంకిత భావాన్ని ప్రదర్శించిందని తెలిపారు.

## దేశానికి వెన్నుముక రైతన్న





**ఎమ్మెల్యే రాందాస్‌నాయక్**

**ప్రజాపక్షం/వైరాః** దేశానికి వెన్నుముక రైతన్న అని వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. వైరా సొసైటీ కార్యాలయంలో శనివారం సొసైటీ అధ్యక్షులు బొర్రా రాజశేఖర్, సొసైటీ సెక్రటరీ బొల్లం రామక్రిష్ణ అధ్యక్షతన జరిగిన రైతుభరోసా పథకంపై ప్రత్యేక మహాజన సభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. రైతులకు ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫి చేస్తుందన్నారు. ప్రభుత్వంరైతులకు రైతు భరోసా పథకం క్రింద పంటలు పెట్టుబడి కోసం ఆర్థిక సహాయాన్ని అందజేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్ని తప్పకుండా అమలు చేస్తుందని అన్నారు. అనంతరం రైతు భరోసా పథకంపై రైతుల వద్ద నుంచి పలు సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్, వైరా సొసైటీ అధ్యక్షులు బొర్రా రాజశేఖర్, సంఘ డైరెక్టర్లు యన్నం వెంకటకోటారెడ్డి, పసుపులేటి హనుమంతరావు, దొంతెబోయిన వెంకటేశ్వర్లు, బొల్లెపోగు శ్రీను, కౌన్సిలర్ కోటయ్య, వైరా మండల కాంగ్రేస్ పార్టీ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి,పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, మచ్చా నర్సింహారావు, మత్స్యశాఖ సొసైటీ అధ్యక్షులు షేక్ రహీం, షేక్ లాల్‌మహ్మద్, తుమ్మల రాణాప్రతాప్, దార్న రాజశేఖర్, నూతి సత్యనారాయణ, పరుచూరి రామారావు, మచ్చా రామారావు, గుడిపుడి రామక్ష్ణి, మంచాల జయరాజు, బుద్దా సురేష్, ఫణితి సైదులు, బట్టా పెద్ద భద్రయ్య, బోళ్ళ గంగారావు, కొల్లి శ్రీనివాసరావు, కొల్లి నాగేశ్వరరావు, వరంగల్ డిఆర్ ఏవో వాలియానాయక్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మౌలానా, ఏవో ఎస్.పవన్‌కుమార్, ఏఈవోలు, సంఘ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.